

# ప్రభుత్వ బడిలో కార్పొరేట్ స్థాయి సదుపాయాలు

- ప్రతి రోజు బడికి వచ్చేలా ప్రత్యేక చర్యలు
- విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్న ప్రభుత్వ బడి
- ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్



4


# సిద్దిపేట సంగారెడ్డి మెదక్



శుక్రవారం 22 మే 2026 పేజీలు : 10


## ఎండలు బీభత్సం.. తట్టుకోలేక ప్రజల ఇక్కట్లు

- ఉక్క పోతతో ఉక్కిరిబిక్కిరి
- అమ్మానుషంగా మారిన రోడ్లు ల
- మధ్యాహ్నం బయటకు రావాలంటేనే భయం

2



# అన్నదాతకు తప్పని ధాన్య గండం!



- కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి కన్నీటి నిరీక్షణ...!
- వేగంగా తూకాలు వేసి ఆదుకోవాలని రైతన్నల వినతి.!

3



# మహిళా సమాఖ్య సమావేశంలో గ్రామాభివృద్ధి, స్వావలంబనపై అవగాహన

రాయికోడ్ మే 21 (ప్రజాజ్యోతి) మండల కేంద్రంలో ఈ రోజు నిర్వహించిన మండల మహిళా సమాఖ్య (ఐకేపీ) సమావేశంలో మహిళల ఆర్థిక స్వావలంబన, గ్రామాభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపుపై సభ్యులకు విస్తృతంగా అవగాహన కల్పించారు. మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా గ్రామీణాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని సమావేశంలో సూచించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల ద్వారా చేపట్టవలసిన ఆదాయ వృద్ధి కార్యక్రమాలు, ఉపాధి హామీ పనుల్లో భాగస్వామ్యం, చిన్న వ్యాపారాల ప్రోత్సాహం, పశుసంవర్ధక మరియు గ్రామీణ జీవనోపాధి కార్యక్రమాలపై సభ్యులకు వివరించారు. గ్రామీణ మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచుకోవాలని సూచించారు. అలాగే ప్రభుత్వం మహిళా సంఘాలకు అందిస్తున్న రుణ సదుపాయాలు, వడ్డీ రాయితీలు, బ్యాంకు లింకేజీ కార్యక్రమాలు, సామాజిక భద్రత




పథకాలు మరియు ఇటీవల ప్రకటించిన సంక్షేమ పథకాల గురించి సమావేశంలో తెలియజేశారు. అర్హులైన ప్రతి మహిళ ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందేలా సంఘ నాయకులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళలు ఐక్యంగా ముందుకు వచ్చి సంఘాల బలోపేతానికి కృషి చేయాలని, గ్రామీణాభివృద్ధిలో మహిళల పాత్ర మరింత పెరగాలని సమావేశంలో ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎంఎం షరీఫ్, ఎంపీఓ అంజలి దేవి, ఇన్చార్జి ఏపీఎం శివయ్య, సీసీలు నర్సింలు, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

# ఎండలు బీభత్సం.. తట్టుకోలేక ప్రజల ఇక్కట్లు





ఉక్క పోతతో ఉక్కిరిబిక్కిరి
అమ్మానుషంగా మారిన రోడ్లు ల
-- మధ్యాహ్నం బయటకు రావాలంటేనే భయం

రాయికోడ్ మే 21 (ప్రజా జ్యోతి): మండలంలో ఎండలు రోజురోజుకు తీవ్రరూపం దాలుస్తున్నాయి. ఉదయం నుంచే మండుతున్న ఎండలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మధ్యాహ్న సమయానికి ఉష్ణోగ్రతలు భారీగా పెరగడంతో రోడ్లు అమ్మానుషంగా మారాయి. అత్యవసర పనులు ఉన్నవారు తప్ప ప్రజలు బయటకు రావడానికి భయపడుతున్నారు. ప్రధాన రహదారులు, బస్టాండ్లు, మార్కెట్ ప్రాంతాలు మధ్యాహ్న సమయంలో నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఎండ వేడి కారణంగా చిన్నపిల్లలు, వృద్ధులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి కోసం ప్రజలు అవస్థలు పడుతుండగా, పలుచోట్ల చల్లని పానీయాల దుకాణాల వద్ద రద్దీ పెరిగింది. ఎండ తీవ్రత కారణంగా రోడ్లపై ప్రయాణించే వాహనదారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనదారులు తలకు గుడ్డలు కట్టుకుని ప్రయాణిస్తున్నారు. కూలీలు, రైతులు ఉదయం, సాయంత్రం సమయాల్లోనే పనులకు వెళ్తున్నారు. వైద్యులు ప్రజలకు అవసరం లేకపోతే మధ్యాహ్న సమయంలో బయటకు రావద్దని సూచిస్తున్నారు. ఎక్కువగా నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు తీసుకోవాలని, చిన్నపిల్లలు, వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా ప్రభుత్వం తాగునీటి సౌకర్యాలు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## హత్నూరలో ధాన్యం కొనుగోలు నిర్లక్ష్యంపై కలెక్టర్ సీరియస్

డి.సి.ఓ, హత్నూర ఎంపీడీవో, ఏపీఎంలకు షోకాజ్ నోటీసులు జారీధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరిక

ప్రజా జ్యోతి సంగారెడ్డి స్టాఫ్ రిపోర్టర్ : హత్నూర మండలంలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో చోటుచేసుకున్న నిర్లక్ష్యం, సమన్వయ లోపాలు, పర్యవేక్షణలో వైఫల్యాలపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో జిల్లా సహకార అధికారి కిరణ్ కుమార్, హత్నూర ఎంపీడీవో బి.శంకర్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ రాజశేఖర్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. హత్నూర మండలంలో ధాన్యం కొనుగోలు కార్యకలాపాలు సంతృప్తికరంగా నిర్వహించబడటం లేదని గుర్తించామని, కొనుగోలు కేంద్రాల వద్ద పర్యవేక్షణ, మానిటరింగ్, సమన్వయంలో తీవ్ర లోపాలు ఉన్నట్లు వెల్లడైందన్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు రాకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఫీల్డ్ స్థాయిలో సమర్థవంతమైన పర్యవేక్షణ లేకపోవడం, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జాప్యాలు చోటుచేసుకోవడం, సంబంధిత శాఖలు, ఏజెన్సీల మధ్య సమన్వయం లోపించడం వల్ల కొనుగోలు ప్రక్రియలో జాప్యం జరుగుతున్నట్లు గుర్తించామన్నారు ,రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు సకాలంలో పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, మూడు రోజుల లోగా తమ వివరణ సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

## పగటి ఎండ దెబ్బ వలన అంతరాయం. రాత్రి వేళలో జనగణన



కల్హే ర్ 21.మే. ప్రజా జ్యోతి సంగారెడ్డి జిల్లాలోని మండల కేంద్రమైన కల్హే ర్ లో ప్రతి గ్రామంలో జన గణన కొరకు తీవ్ర అంతరాయం ఎండ తీవ్రత వలన కలుగుతుంది. తీవ్రమైన ఎండల కారణంగా జనగణన ప్రక్రియకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. పగటిపూట ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటం, జనాలు సహకరించకపోవడంతో కొందరు ఎన్యూమరేటర్లు సాయంత్రం చల్లబడ్డాక ఇళ్లకు వెళ్తున్నారు. ఈ సమయంలో రైతులు, ఉద్యోగస్థులు, వ్యాపారులు ఇళ్లలోనే అందుబాటులో ఉంటుండటంతో సమాచార సేకరణ వేగంగా జరుగుతోందని సిబ్బంది చెబుతున్నారు. పూర్తిగా సహాయ సహకారాలతో సమాచారం సేకరిస్తున్నామని తెలిపారు.

# సంగారెడ్డి జిల్లాలో ఘోర ప్రమాదం





**: జాతీయ రహదారిపై పల్టీలు కొట్టిన కారు!**

**ప్రజా జ్యోతి సంగారెడ్డి స్టాఫ్ రిపోర్టర్** :"సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సదాశివపేట పట్టణ పరిధిలోని జాతీయ రహదారి 65పై, మద్దికుంట చౌరస్తా వద్ద ఓ కారు అదుపుతప్పి పల్టీలు కొట్టింది. జహీరాబాద్ వైపు వెళ్తున్న కారును, ఒక లారీ ఓవర్ టేక్ చేయబోయి పక్కనుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో కారు అదుపుతప్పి హైవేపై నుంచి పల్టీలు కొట్టుకుంటూ కిందకు పడిపోయింది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో కారులో ముగ్గురు ప్రయాణికులు ఉన్నారు. వీరంతా మహారాష్ట్రకు చెందిన వారిగా గుర్తించారు. ప్రమాదంలో ఒకరికి తలకు తీవ్ర గాయాలు కాగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాల య్యాయి. స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ ద్వారా క్షతగాత్రులను సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, మెరుగైన చికిత్స కోసం తాము ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్తామని గాయపడిన వారు అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం."

# వేసవి సెలవుల్లో ఊరికి వెళ్తున్నారా జరభద్రం

**సంగారెడ్డి జిల్లా పోలీసులు. అనుమానాస్పద వ్యక్తుల గురించి డయల్ 100, పోలీసు కంట్రోల్ రూమ్ నెంబర్ 8712656739 కు సమాచారం ఇవ్వండి.. : జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపిఎస్.**



**ప్రజా జ్యోతి సంగారెడ్డి స్టాఫ్ రిపోర్టర్:** వేసవి సెలవుల దృష్ట్యా పాఠశాలలు, కళాశాలలకు సెలవులు రావడంతో చాలామంది తమ సొంత గ్రామాలకు లేదా ఇతర ప్రాంతాలకు ప్రయాణాలు చేస్తుంటారు. ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకుని దొంగలు నేరాలకు పాల్పడే అవకాశం ఉన్నందున, ఊరికి వెళ్లే వారు అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంక్ సూచించారు.

**వేసవి సెలవులలో ఇంటికి తాళం వేసి, ఇతర ప్రాంతాలకు వెళ్ళేవారు పాటించవలసిన జాగ్రత్తలు -- జిల్లా పోలీసుల సూచనలు:**

ఇంట్లో బంగారు, వెండి నగలు, విలువైన వస్తువులు ఉంటే బ్యాంక్ లాకర్లలో భద్రపరచడం మంచిది.

ఊరికి వెళ్తున్నప్పుడు పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించమని చెప్పాలి.

ద్విచక్ర వాహనాలు, కారులను ఇంటి ఆవరణలోనే పార్క్ చేయాలి; రోడ్డుపై నిలపరాదు.

విలువైన వస్తువులు, వ్యక్తిగత ఆర్థిక విషయాల సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దు.

బయట పార్క్ చేసే వాహనాలకు హ్యాండిల్ లాక్‌తో పాటు వీల్ లాక్ కూడా వేయాలి.

ఇంటికి సెంట్రల్ లాకింగ్ సిస్టమ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ఉత్తమం.

సీసీ కెమెరాలను ఇంటర్నెట్‌కు అనుసంధానం చేస్తే మొబైల్ ద్వారా ఎక్కడి నుంచైనా ఇంటిని పర్యవేక్షించవచ్చు.

తమ ప్రాంతంలో గస్తీ ఏర్పాటుకు ప్రజలు సహకరించాలి. సమీప పోలీస్ స్టేషన్ అధికారులు, ఇతర అధికారుల ఫోన్ నంబర్లు సెల్ ఫోన్‌లో సేవ్ చేసుకోవాలి.

అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తుల గురించి డయల్ 100 లేదా జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ నెంబర్ 8712656739 కు సమాచారం ఇవ్వాలి. సుదూర ప్రాంతాలకు వెళ్తున్నప్పుడు మీ ఇంటి యొక్క లొకేషన్ ను మరియు ప్రయాణ తేది వివరాలను సమీప పోలీస్ స్టేషన్‌లో లేదా జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ కు సమాచారం అందిస్తే, మీ ప్రాంతంలో పోలీసు గస్తీ ముమ్మరం చేయడం జరుగుతుంది. దొంగతనం జరిగినట్లు అనుమానం వచ్చిన వెంటనే నేరాస్థలం యొక్క లొకేషన్ ను సంబంధిత పోలీసులకు లేదా జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ కు తగిన వివరాలతో సమాచారం అందించాలి.

## రాజీవ్ గాంధీ ఆశయాలతో ముందుకు సాగాలి

**-అందోల్-జోగిపేట మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి**

**-జోగిపేట కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా వర్ధంతి కార్యక్రమం**



**అందోలు, మే 21, (ప్రజా జ్యోతి):** మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా జోగిపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా స్మారక సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అందోల్--జోగిపేట మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి పాల్గొని రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని ఆధునిక సాంకేతిక దిశగా నడిపించిన దూరదృష్టి గల నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. సమాచార సాంకేతికత, టెక్నాలజీ రంగాల్లో ఆయన చేసిన సంస్కరణలు నేటి భారత అభివృద్ధికి బలమైన పునాదిగా నిలిచాయని అన్నారు. దేశ అభివృద్ధిలో యువత పాత్ర కీలకమని, యువతకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించి ప్రోత్సహించిన మహనీయుడు రాజీవ్ గాంధీ అని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, స్థానిక సంస్థల బలోపేతానికి కీలకమైన 73, 74 రాజ్యాంగ సవరణలకు రాజీవ్ గాంధీ ప్రధాన కారకుడని తెలిపారు. మహనీయుల త్యాగాల పునాదులపై నిర్మితమైన కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పేద ప్రజల పక్షాన నిలబడే పార్టీ. దేశ ఐక్యత, లౌకికవాదం, సామాజిక సమానత్వం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజల మధ్యలో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం పనిచేయాలని సూచించారు. సమాజ సేవే ప్రధాన లక్ష్యంగా మనమంతా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మన నాయకుడు. మంత్రి దామోదర రాజనర్సింహ నాయకత్వంలో అందరూ ఐక్యంగా పనిచేస్తూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ లు సురేందర్ గౌడ్, గూడెం మల్లయ్య, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు...

**కుత్బుల్లాపూర్ :** తెలంగాణ వాణఆధునిక భారత స్వాప్నికుడు, సంస్కరణల సృష్టికర్త, మాజీ ప్రధాని భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ , వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లు అర్పించిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వర్గీయ రాజీవ్ గాంధీ శాస్త్ర సాంకేతిక, రంగాల్లో , ఐటీ , టెలికమ్యూనికేషన్ రంగాల్లో భారత దేశంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకువచ్చి భారతదేశ అభివృద్ధికి కృషి చేశారని, అతి పిన్న వయసులోనే భారత ప్రధానిగా బాధ్యతలను చేపట్టి అనేక రంగాల్లో మార్పులకు శ్రీకారం చుట్టారని,

# గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం గ్రామానికి వెలుగులు నింపుతున్న గ్రామ సర్పంచ్





**మనూర్ మే 21(ప్రజాజ్యోతి):** నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మనూర్ మండలంలో గల తోర్నాల్ గ్రామ సర్పంచ్ ఉచిత కంటి శిబిరం ఏర్పాటు చేసి గ్రామంలో కొత్త వెలుగులు నింపాలని గ్రామ ప్రజలకు ఆదేశించి కంటి పరీక్షలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు గ్రామ సర్పంచ్ సంగమేష్ పాటిల్,ఉప సర్పంచ్ వినోద అంబోజి, మాజీ సర్పంచ్ సంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లికార్జున్ పటేల్, ఖలేద్, కె కె నర్సింలు, శివరాజ్, నిరంజన్ రెడ్డి, హాఫీజ్, పుండ్లిక్, శరణప్ప మరియు తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

# అన్నదాతకు తప్పని ధాన్య గండం!

## కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి కన్నీటి నిరీక్షణ...!

## వేగంగా తూకాలు వేసి ఆదుకోవాలని రైతన్నల వినతి.!





**నర్సాపూర్/మెదక్ మే 21 (ప్రజాజ్యోతి)** నేలతల్లిని నమ్ముకుని, చెమటను నెత్తురుగా మార్చి, కంటిమీద కునుకు లేకుండా ఆరుగాలం శ్రమించిన అన్నదాత.. తాను పండించిన బంగారు పంటను అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాల ముంగిట నరకయాతన అనుభవిస్తున్నాడు. దేశానికి వెన్నుముకగా నిలిచి ప్రపంచానికి అన్నం పెట్టే ఆ రైతన్న, మెదక్ జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఐకేపీ కేంద్రాల వద్ద రోజుల తరబడి తూకాల కోసం కళ్లల్లో ఒత్తులు వేసుకుని నిరీక్షిస్తున్నాడు. శ్రమకోర్చి గింజ గింజ పోగుచేసిన ఆ కర్షకుడు, నేడు కొనుగోలు ప్రక్రియలో ఎదురవుతున్న ఒడిదుడుకులకు దిక్కుతోచని స్థితిలో విలవిలలాడుతున్నాడు.

**కళ్ల ముందే కష్టం కరుగుతుందేమోనని ఆందోళన..!**

మానవ మనుగడకై మండుటెండలను సైతం లెక్కచేయకుండా అహర్నిశలు శ్రమించిన రైతన్నకు.. పంట చేతికొచ్చే వరకు ఒక భయమైతే, తెచ్చిన ధాన్యాన్ని గట్టెక్కించడం మరో ఎత్తుగా మారింది. కేంద్రాల్లో తగినన్ని తార్పాలిన్లు అందుబాటులో లేకపోవడంతో, ఆకాశంలో కారుమబ్బులు కమ్మినప్పుడల్లా ఆ కర్షకుని గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఎక్కడ అకాల వర్షాలు ముంచెత్తి తన కష్టాన్ని కన్నీటి పాలు చేస్తాయోనని భయాందోళన చెందుతున్నాడు. నీడ లేని కల్లాల్లో, రాత్రిం బవళు ధాన్యపు కుప్పలకు కాపలా కాయాల్సిన దుస్థితి నేడు అన్నదాతకు దాపురించింది.

**సమన్వయంతోనే.. సమస్యకు పరిష్కారం!**

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో తూకాలు వేగవంతం కాకపోవడం, మిల్లులకు తరలింపు ఆలస్యం కావడం వల్లనే ఈ కన్నీటి నిరీక్షణ తలెత్తుతోంది. ఒకవైపు ప్రకృతి కన్నెర్ర జేస్తుంటే, మరోవైపు అధికార యంత్రాంగం నెమ్మదిగా వ్యవహరిస్తోందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్నదాతలు సైతం ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం ధాన్యాన్ని ఆరబెట్టి, తేమ శాతం తగ్గించి అధికారులకు సహకరిస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి, యుద్ధప్రాతిపదికన కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, తార్పాలిన్ల కొరత తీర్చాలని క్షేత్ర స్థాయిలో కర్షక లోకం ముక్తకంఠంతో కోరుతోంది. పాలకులు తక్షణమే స్పందించి తూకాలను పూర్తి చేస్తేనే.. ఆ అన్నదాత కన్నీరు తుడిచి, వారి కష్టానికి తగిన ప్రతి ఫలాన్ని, గౌరవాన్ని అందించినట్లవుతుందని సమాజంతో పాటు ప్రకృతి కూడా ఆకాంక్షిస్తోంది.


# ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణను పారదర్శకంగా నిర్వహించాలి

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలి : జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**ప్రజా జ్యోతి సంగారెడ్డి స్టాఫ్ రిపోర్టర్:** జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు.ఎలాంటి తప్పులు లేని, అత్యంత పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనే జిల్లా యంత్రాంగం, రాజకీయ పార్టీల ప్రధాన లక్ష్యంగా ఉండాలని ఆయన అన్నారు.గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ కార్యక్రమంపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓటర్ జాబితా సవరణకు సంబంధించిన వివిధ దశలను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.ఈ ప్రక్రియలో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఓటర్ల జాబితాను పరిశీలించడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని రాజకీయ పార్టీలు తక్షణమే అన్ని నియోజకవర్గాలలో బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని కోరారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం ద్వారా ప్రజాస్వామ్య బలోపేతంలో భాగస్వాములు కావాలని, అధికారులు మరియు రాజకీయ పార్టీల ప్రతినిధులు నిరంతరం సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించిన వివిధ దశల షెడ్యూల్ వివరాలను సమావేశంలో వివరించారు.ఈ సమావేశంలో సంగారెడ్డి తహసిల్దార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగపు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయసాగు సామగ్రి దహనం.పంట వ్యర్థాల దహనం.వలన.



**కల్హే ర్. 21.మే. ప్రజా జ్యోతి** సంగారెడ్డి జిల్లా లోని మండల కేంద్రమైన కల్హే ర్ లోని. బీబీ పేట్ గ్రామ శివా రులో గుర్తుతెలియని వ్యక్తులు పంట వ్యర్థాలకు నిప్పు పెట్టగా, ఆ మంటలు అదుపుతప్పి శివారు మొత్తం వ్యాపించాయి. ఈ ప్రమాదంలో పొలాల్లో ఉన్న కొందరు రైతుల సాగునీటి పైపులు, విద్యుత్ వైర్లు మంటల్లో కాలి పూర్తిగా బూడిదయ్యాయి. కళ్లముందే సాగు సామగ్రి బుగ్గిపాలు కావడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో మంటలు పెట్టేటప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని కోరుతున్నారు. వ్యవసాయదారులు వేసవికాలంలో తమవ్యవసాయానికి సంబంధించిన పనిముట్లు పై జాగ్రత్త వహించి ఇలాంటి దుర్ఘటన సంఘటనలు జరగకుండా చూసుకోవడం బాధ్యతగా పంట వ్యర్థాలను తగలబెట్టడం మంచిదని ప్రజలు కోరుకుంటున్నారు.

# పట్టణ అధ్యక్షుడు గంగన్న కు సన్మానాల వెల్లువ

**పార్టీ ఏదైనా ఆ కుర్చీ అయనదే**

**పట్టణ అధ్యక్షుడికి చైర్మన్ వైస్ చైర్మన్ ల సన్మానం**



**మెదక్ (ప్రజాజ్యోతి) మే 21 :** పార్టీ ఏదైనా అధ్యక్షుడు ఆయనే ఎందుకంటే పార్టీ ఆదేశాలను తు చ తప్పకుండా ఆంఖిత భావంతో పాటిస్తు ప్రజాప్రతినిధులు, నాయకుల సహకారంతో ఏ కార్యక్రమాన్ని అయినా అమలు చేసే వ్యక్తి కనుక ఆ కుర్చి అయననే వరిస్తుంది. వయసుతో పనిలేదు ఏ సమావేశంలో అయినా ముందు గానే మైక్ అందుకుంటాడు ఆయనే ప్రస్తుత కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మందుగుల గంగన్న కాగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , మెదక్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా మందుగుల గంగాధర్ ని నియమించినందున గురువారం మెదక్ మున్సిపల్ చైర్మన్. కానుగు రాధిక భూపతిరాజు , వైస్ చైర్మన్. దొంతి నరేష్ , శాలువాలతో ఘనంగా సన్మానించారు ..రాష్ట్ర నాయకులు మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు మరియు మెదక్ శాసనసభ్యులు రోహిత్ రావు నాయకత్వంలో మెదక్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ పథకాలను ప్రజల మధ్యలోకి తీసుకెళ్లి పార్టీ పట్ల ప్రజల ఆదరణ ఉండే విధంగా వారు సూచించారు. సన్మానం చేయడం పట్ల పట్టణ అధ్యక్షులు గంగాధర్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్. రాగి అశోక్ , భూపతి రాజు , సయ్యద్ ఉమర్ , పెల్లి కొట్టాల నాగరాజు , బుడ్డ రాజు, బాలరాజు యాదవ్ , దేవుల నాయక్ , మహమ్మద్ ముజాంబిల్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతి భారతీయుడు హింసకు వ్యతిరేకం

## సర్పంచుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షులు చంద్రం కృష్ణ గౌడ్




**కౌడిపల్లి ప్రజా జ్యోతి, మే 21:** ప్రతి భారతీయుడు హింసకు వ్యతిరేకంగా ఉండాలని జిల్లా సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు, కౌడిపల్లి గ్రామ సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్ అన్నారు. గురువారం కౌడిపల్లి బస్టాండ్ ఆవరణంలో భారతరత్న, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంద్రం కృష్ణ గౌడ్ మాట్లాడుతూ దేశ సమగ్రత, శాంతి, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానేత రాజీవ్ గాంధీ అని కొనియాడారు. దేశవ్యాప్తంగా రాజీవ్ గాంధీ వర్ధంతిని "ఉగ్రవాద వ్యతిరేక దినం"గా నిర్వహిస్తూ శాంతి, సామరస్యం, సౌభ్రాతృత్వాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రజల సంక్షేమమే అసలైన రాజకీయమని నమ్మిన రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగించడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు. అలాగే రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో చేపట్టిన విప్లవాత్మక సంస్క రణలు, అభివృద్ధి కార్యక్రమాలను ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ శ్వేతా మల్లికార్జున గౌడ్, జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు కౌడ శ్రీనివాస్ గుప్తా, విశ్రాంతి ఉద్యోగుల సంఘం నాయకులు పుండరీకం గౌడ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు రాగుల భూమయ్య పటేల్, అశోక్ నాయి, నాన్ల వెంకటేశం గుప్తా, కుర్మ లక్ష్మణ్, సత్యనారాయణ గౌడ్, దర్జీ చంద్రం, సంబరపు తిరుమలేష్, మక్బూల్, రమేష్ నాయక్, దేవేందర్ కుమార్, మురళి నాయక్, వెంకటేశ్వర్లు, వడ్ల శ్రీనివాస్ చారి, కౌడిపల్లి కారోబర్ ఎల్లం, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# కంప్యూటర్ యుగానికి బాటలు వేసిన గొప్ప నాయకుడు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ

**మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, టౌన్ అధ్యక్షులు**



**మెదక్ (ప్రజాజ్యోతి) మే 21 :** మాజీ ప్రధాని భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందుగుల గంగాధర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు .

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ శ్రీమతి కానుగు రాధికా భూపతి రాజు మాట్లాడుతూ కేవలం 40 సంవత్సరాలకే చిన్న వయసులోనే భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టి దేశాన్ని ఆధునిక భారతదేశంగా నడిపించిన దూరదృష్ట నాయకుడన్నారు. రాజీవ్ గాంధీ దేశంలోనే సాంకేతిక విద్యకు ప్రాధాన్యం ఇచ్చి కంప్యూటర్ యుగానికి బాటలు వేసిన గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ మాట్లాడుతూ ఈ దేశం కోసం గాంధీ కుటుంబం తమ రక్తాన్ని అర్పించింది భారత మాజీ ప్రధానులు శ్రీమతి ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ లు దేశ సమగ్రత కోసం వారి ప్రాణాలే త్యాగం చేశారని కొనియాడారు. పట్టణ పార్టీ అధ్యక్షులు మందుగుల గంగాధర్ మాట్లాడుతూ నేటికీ మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ అమరులై 30 సంవత్సరాలు పూర్తి అయ్యాయి 1991 మే 21న తమిళనాడులోని పేరంబుదూర్ లో ఎన్నికల ప్రచార సభలో ఎల్ టీ టీఈ ఉగ్రవాదుల ఆత్మాహుతి బాంబు దాడిలో ఆయన మరణించడం దేశానికే తీరని లోటని ఈ మహానేతకు ఘనమైన నివాళులు అర్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కానుగు భూపతి రాజు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాగి అశోక్ గారు, సయ్యద్ ఉమర్, బుడ్డ రాజు, పిల్లి కొట్టాల నాగరాజు, దేవుల నాయక్, బాలరాజు యాదవ్, ఎండి ముజామిల్ మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.. అమర్ హై! రాజీవ్ గాంధీ!! అమర్ హై! అమర్ హై!! అంటూ నినాదాలు చేశారు.!

# పెద్దమ్మ దేవి వార్షికోత్సవ ఆహ్వాన పత్రిక ను మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డికి అందజేత.



**హవేలి ఘనపూర్ (ప్రజా జ్యోతి) మే21:** మండలం లోని రాజపేట్ గ్రామంలో ముదిరాజ్ సం ఘం ఆధ్వ ర్యంలో ఈ నెల 20 నుంచి 24 వరకు నిర్వహించనున్న శ్రీశ్రీ పెద్దమ్మ దేవి పం చమ వార్షికోత్సవాల సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్ యం పద్మదేవేందర్ రెడ్డి ని మంగళవారం హైదరాబాద్లో వారి నివాసంలో రాజపేట్ బిఆర్ఎస్ నాయకులు సాయ గౌడ్, ఏసు, ముదిరాజ్ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ దేవి పంచమ వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను అందజేసి ఉత్సవాలకు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు చింతకుంట సాయిలు, బోళ్ళ కిషన్,కలకుంట్ల అశోక్, చెవ్వనల్ల పోచయ్య, బొల్ల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడిలో కార్పొరేట్ స్థాయి సదుపాయాలు







**-ప్రతి రోజు బడికి వచ్చేలా ప్రత్యేక చర్యలు**

**-విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్న ప్రభుత్వ బడి**

**-ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్**

**తూప్రాన్ (ప్రజాజ్యోతి) మే 21:** తూప్రాన్ ఉన్న ఎంపీపీ ఎస్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యా రంగంలో కొత్త మార్పులకు శ్రీకారం చుడుతోంది. చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించి, నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, వ్యక్తిగత శ్రద్ధ, ఆధునిక సదుపాయాలతో విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది.ప్రీ ప్రైమరీ విద్యార్థులకు బోధన అందించేందుకు టిటిసి పూర్తి చేసిన ప్రత్యేక టీచర్‌తో పాటు ఒక ఆయాను నియమించారు. చిన్నారులకు పూర్తిగా ఆంగ్ల మాధ్యమంలో బోధన చేయడంతో పాటు ఆటపాటల ద్వారా ఆనందకరమైన విద్యను అందిస్తున్నారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటూ, ప్రతిరోజూ హోంవర్క్ ఇచ్చి చదువుపై ఆసక్తి పెంచుతున్నారు.పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత కల్పించారు. ప్రతి తరగతి గదిలో ఫర్నిచర్ ఏర్పాటు చేసి సౌకర్యవంతమైన వాతావరణంలో బోధన కొనసాగిస్తున్నారు. ఏఐ ఆధారిత కంప్యూటర్ శిక్షణతో విద్యార్థులను భవిష్యత్తు సాంకేతిక ప్రపంచానికి సిద్ధం చేస్తున్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే క్రమ శిక్షణతో కూడిన విద్యాబోధన అంది స్తున్నారు. ప్రతి విద్యార్థి ప్రతిరోజూ పాఠశాలకు హాజరయ్యేలా ప్రత్యేక పర్య వేక్షణ చేపడుతున్నారు. ముఖ్యంగా ప్రతి రోజు సాయంత్రం 6:30 గంటల నుంచి 8:30 గంటల వరకు ప్రధానో పాధ్యాయుడు లక్ష్మణ్ స్వయంగా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి చదువుపై పర్యవేక్షణ




చేయడం విశేషం. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి ఉచితంగా రెండు జతల యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్స్, నోట్ బుక్స్, మధ్యాహ్న భోజనం, పోషకా హారమైన రాగి జావా అందిస్తున్నారు.ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా మా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందిస్తున్నాం. తూప్రాన్ గ్రామ ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్ కోరారు.

# హైవేపై ఎగిసిపడ్డ మంటలు కంటైనర్ లారీలో 8 కార్లు అగ్నికి ఆహుతి







**తూప్రాన్ (ప్రజాజ్యోతి) మే 21:** మెదక్ జిల్లా తూప్రాన్ పరిధిలోని 44వ జాతీయ రహదారి బైపాస్ రోడ్డులో నాగులపల్లి బ్రిడ్జి వద్ద గురువారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుని స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. నిజాంబాద్ వైపు నుంచి హైదరాబాద్ దిశగా వెళ్తున్న కంటైనర్ లారీలో ఒక్కసారిగా క్యాబిన్ భాగం నుంచి మంటలు చెలరేగాయి. డ్రైవర్ గమనించేలోపే మంటలు వేగంగా వ్యాపించి మొత్తం కంటైనర్‌ను ఆవరించాయి.లారీలో కొత్త కార్లు తరలిస్తుండగా, మంటలు క్షణాల్లోనే కంటైనర్ మొత్తానికి వ్యాపించి అందులో ఉన్న 8 కార్లు పూర్తిగా అగ్నికి ఆహుత య్యాయి. మంటల తీవ్రతతో జాతీయ రహదారిపై దట్టమైన పొగలు అలుము కోవడం తో వాహనదారులు భయాందోళనకు గుర య్యారు. కొంతసేపు ట్రాఫిక్‌కు అంత రాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న వెంటనే తూప్రాన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియం త్రించారు. రామాయం పేట నుంచి ఫైర్ ఇంజన్ చేరుకునేలోపే కంటైనర్ లారీతో పాటు కార్లు పూర్తిగా బూడిదయ్యాయి. అగ్నిప్రమాదానికి గల కారణాలపై పోలీ సులు విచారణ చేపట్టారు.

## మిర్చి మిల్లులో చోరీ.. 70 వేలు అపహరణ



**నర్సాపూర్ మే 21 (ప్రజాజ్యోతి)** నర్సాపూర్-మెదక్ రోడ్డులోని చింతకుంట శివారులో గల 'యూసుఫ్ మిర్చి మిల్లు'లో బుధవారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. ఎస్ఐ రంజిత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని దుండగులు మిల్లు వెనుక వైపు ఉన్న ఇనుప షీట్లను తొలగించి లోపలికి చొరబడ్డారు. కౌంటర్ టేబుల్ తాళాలు పగలగొట్టి అందులోని 70 వేల నగదును పట్టుకెళ్లారు. ఆధారాలు దొరకకుండా ఉండేందుకు అక్కడ ఉన్న సీసీ కెమెరాను సైతం డిస్కనెక్ట్ చేశారు. గురువారం ఉదయం మిల్లు కార్మికులు గమనించి యజమాని మీర్ ముజాహిద్ అలీకి సమాచారం అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

## నేడు నేతల చిత్ర పటాలకు పాలాభి షేకం

**మండల పార్టీ అధ్యక్షులు మల్లేష్ గౌడ్**



**కొల్చారం(ప్రజాజ్యోతి) మే 21 :** కార్మికులకు కనీస వేతనాలు పెంచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంక టస్వామి చిత్రపటాలకు పాలాభి షేకం ఉంటుం దని మం డల పార్టీ అధ్య క్షులు నాగు ల గారి మ ల్లేష్ గౌడ్ తెలిపారు. తెలంగాణలోని 1 కోటి 11 లక్షల మంది కార్మికులకు కార్మికుల కనీస వేతనాలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటిస్తు శుభవార్త తెలిపారు. కార్మికుల కనీస వేతనాల పెంపు జూన్ 1వ తేదీ నుంచి అమలులోకి వస్తుందని తెలిపారు. కనీస వేతనాలు పెంచిన శుభ సందర్భంగా ముఖ్యమంత్రి కార్మికులందరికీ శు భాకాంక్ష లు తెలియజేశారు. ఈ శుభ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నేతలు కార్యకర్తలు ఇది కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తీసుకున్న అతి గొప్ప నిర్ణయం కనుక నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్ ల ఆదేశాల మేరకు కొల్చారంశీ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం కొల్చారం మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటో కి మరియు కార్మిక శాఖ మంత్రి వర్యులు డా వివేక్ వెంకటస్వామి ఫోటోలకి పాలాభిషేకం కార్యక్రమం ఉన్నది. కావున కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు కాంగ్రెస్ పార్టీ సర్పంచులు ఉప సర్పంచులు వార్డు సభ్యులు సింగిల్ విండో చైర్మన్లు ముఖ్య నాయకులు ఎన్ ఎస్ యు ఐ నాయకులు యువజన కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని అట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# రైస్ మిల్లులను పరిశీలించిన





మెదక్ జిల్లా అడిషనల్ కలెక్టర్ నగేష్.....

**పెద్ద శంకరంపేట్ ప్రజా జ్యోతి;** మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండల పరిధిలోని రాచారాయి, సప్తగిరి, సిద్ధినాయక, గణేష్, వీరభద్ర రైస్ మిల్లులను అడిషనల్ కలెక్టర్ నగేష్ గురువారం సందర్శించి ధాన్యం అన్‌లోడింగ్, తూకం ప్రక్రియలను పరిశీలించారు. మిల్లుల్లో పని చేస్తున్న సిబ్బంది, హమాలీలతో మాట్లాడి నిలిచిపోయిన లోడ్‌ల వివరాలు తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లర్లకు సూచించారు. ఈ సందర్భంగా సిద్ధినాయక రైస్ మిల్లులో ఒక్కో ధాన్యం బస్తాపై స్వల్ప బరువు కోత జరుగుతోందని రైతులు అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే మిల్ యజమానితో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు నిర్వహించాలని సూచించారు....

# సాహిత్యంతోనే సమాజంలో మార్పు





జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

**మెదక్ (ప్రజాజ్యోతి) మే 21:** సాహిత్యంతోనే సమాజంలో మార్పు వస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. గురువారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లా యువజన ,క్రీడ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్లోని మీటింగ్ హాల్లో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ. .సమాజ అభ్యున్నతికి సాహిత్యం ఒక శక్తివంతమైన సాధనం అన్నారు. సాహిత్యంతోనే సమాజంలో మార్పు వస్తుందని, కవి సమ్మేళనం ద్వారా సాహిత్యం కేవలం వినోదానికి మాత్రమే కాకుండా, సమాజంలో మంచి మార్పును తీసుకురాగల శక్తిగా నిలుస్తుందనే భావనను ప్రజల్లోకి తీసుకెళ్లడం ప్రధాన ఉద్దేశ్యం అని తెలిపారు. యువ కవులకు ప్రోత్సాహం అందించడంతో పాటు, తెలుగు భాషా సాహిత్య వైభవాన్ని కొత్త తరానికి పరిచయం చేయడం కూడా ఈ కార్యక్రమం ప్రత్యేకత అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి ప్రముఖ కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు పాల్గొని తమ కవిత్వం ద్వారా సామాజిక సమస్యలు, మానవ విలువలు, యువత బాధ్యత, మహిళా సాధికారత, ప్రకృతి పరిరక్షణ వంటి అంశాలపై చైతన్యం కలిగించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, డివైఎస్ఓ రమేష్, జిల్లా సంక్షేమ అధికారి హేమా భార్గవి,కవులు, రచయితలు, తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాలు అద్భుతంగా పని చేస్తున్నాయి

**హైదరాబాద్ :** మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలల పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలపై ప్రిన్సిపల్ లతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ బాలమయాదేవి,మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులాల సెక్రటరీ సైదులు, ఆర్సీవో లు,ప్రిన్సిపల్ లు,ఇతర అధికారులు పాల్గొన్నారు. 100 శాతం అత్యుత్తమ ఫలితాలు సాధించిన గురుకులాల పాఠశాలల ప్రిన్సిపల్ లను మంత్రి సత్కరించారు. మంత్రి మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో 100 శాతం పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలు సాధించిన పాఠశాలల ప్రిన్సిపాల్ లకు అభినందనలు ఫలితాలు తక్కువగా వచ్చిన గురుకుల పాఠశాలలు ఈసారి మరిన్ని మంచి ఫలితాలు సాధించేలా పని చేయాలి. గతంలో 327 స్కూల్ లలో 301 స్కూల్ లో ప్రైవేట్ భవనాల్లో ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇస్తుంది గురుకులాలు అద్భుతంగా పని చేస్తున్నాయి అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. ప్రభుత్వం మెస్ ఛార్జీలు కాస్మొటిక్ చార్జీలు పెంచుకున్నాం. ప్రిన్సిపల్ లకు అభినందనలు.

## కార్మికులకు వేతనాలు పెంపు

**హైదరాబాద్ :** తెలంగాణ కార్మికులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. కార్మికుల కనీస వేతనాలను పెంచుతున్నట్లు ప్రకటించారు. ఈ వేతనాల పెంపు కోసం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా తీసుకున్న నిర్ణయాలను సీఎం స్వయంగా వివరించారు. ఇక వేతనాల పెంపుతో 1.11 కోట్ల మంది కార్మికులకు మేలు కలుగుతుందని ముఖ్యమంత్రి ప్రకటించారు. మూడు కేటగిరీలుగా కార్మికులను విభజించి.. వేతనలు పెంచినట్లు తెలిపారు.రాష్ట్రంలోని కార్మికులకు రేవంత్ రెడ్డి సర్కార్ వరాల జల్లు కురిపించింది. వారికి అందే కనీస వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ వేతనాల పెంపు జూన్ 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించారు. ఈ నిర్ణయంతో తెలంగాణలోని 1.11 కోట్ల మంది కార్మికులకు లబ్ధి చేకూరుతుందని వెల్లడించారు. కార్మికుల హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి మీడియా సమావేశం నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి.. కార్మికుల కనీస వేతనాల పెంపు నిర్ణయాలను, విధివిధానాలను వివరించారు. ఇక రాష్ట్రంలోని కార్మికులను ప్రభుత్వం మూడు జోన్లుగా విభజించింది. కార్పొరేషన్ల పరిధిలో ఉండే కార్మికులను గ్రేడ్ 1గా.. మున్సిపాలిటీ పరిధిలో ఉండే కార్మికులను గ్రేడ్ 2గా.. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే కార్మికులను గ్రేడ్ 3గా పేర్కొంది.ఇక అన్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హై స్కిల్డ్ అంటూ నాలుగు కేటగిరీలుగా కార్మికులను విభజించి వారికి కనీస వేతనాలను పెంచుతున్నట్లు చెప్పారు. జోన్ 1లో కనీస వేతనం ప్రస్తుతం రూ.12,750 ఉండగా.. దాన్ని రూ.16 వేలకు పెంచారు. ఇక స్కిల్డ్ కార్మికులకు రూ.13,772 గా ఉన్న జీతాలను రూ.18, 500లకు పెంచారు. ఇక జోన్ 1లో సెమీ స్కిల్డ్ కార్మికులకు రూ.13,592 నుంచి రూ.17000 పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.గత 10 ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేయని పనిని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లలో చేసి చూపించిందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణలోని కార్మికుల సంక్షేమానికి తమ సర్కార్ కట్టుబడి ఉందని తేల్చి చెప్పారు. బీఆర్ఎస్ సర్కార్ రాష్ట్రంలోని కార్మికులను పట్టించుకోలేదని మండిపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే.. కార్మికుల కనీస వేతనాలపై సబ్‌కమిటీని వేసినట్లు చెప్పారు. దీంతో కోటి 11 లక్షల మందికి మేలు జరుగుతుందని వివరించారు.

## మత్తు పదార్థాల నిర్మూలనకు
## టూ టౌన్ పోలీసుల ప్రత్యేక తనిఖీలు

**– ఇన్స్పెక్టర్ ఇజాజ్‌ఉద్దీన్**

**మహబూబ్ నగర్ :** మహబూబ్నగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నార్కోటిక్ జాగిలం “రుద్ర” సహాయంతో టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజ్ ఉద్దీన్, పోలీసు సిబ్బంది కలిసి మోటర్ లైన్స్ లోని ట్రాన్స్పోర్ట్ కార్యాలయం తో పాటు ఇతర ప్రాంతాలలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. మత్తు పదార్థాల అమ్మకం, కొనుగోలు, రవాణా మరియు వినియోగం జరగకుండా నిరోధించేందుకు ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా పాన్ షాపులు, కిరాణా దుకాణాల యజమానులకు 18 సంవత్సరాల లోపు పిల్లలకు ఎలాంటి టొబాకో ఉత్పత్తులు, గుట్కా, సిగరెట్లు విక్రయించరాదని స్పష్టమైన సూచనలు ఇవ్వడం జరిగింది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజ్ ఉద్దీన్ మాట్లాడుతూ, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలు ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా కుటుంబాలను మరియు సమాజాన్ని కూడా నాశనం చేసే ప్రమాదకరమైన వ్యసనమని తెలిపారు. జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తోందని, ప్రజలు కూడా అనుమానాస్పద వ్యక్తులు లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు